ప్రజాశక్తి
గురువారం 22 మే 2025
5
విజయనగరం



తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పాక్షిక మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో నగరంలో కొన్ని చోట్ల శుక్ర, శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఉదయం కొన్ని ప్రాంతాలకు, మధ్యాహ్నం కొన్ని ప్రాంతాలకు ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని చెప్పారు. ఉదయం పూట నీటి సరఫరా జరిగే ప్రాంతాలలో యథాతథంగా కొనసాగుతుందని తెలిపారు. మధ్యాహ్న వేళల్లో నీటి సరఫరా జరిగే.. కంటోన్మెంట్ ట్యాంకు, బాలాజీ ట్యాంకు, కెఎల్ పురం ట్యాంక్, అయ్యన్నపేట ట్యాంకు, బిసి కాలనీ ట్యాంకు, ఉడా కాలనీ ట్యాంకు, బిటి అగ్రహారం ట్యాకు, కొత్తాగ్రహారం ట్యాంకు పరిధిలోని ప్రాంతాల్లో మార్పులు ఉంటాయని చెప్పారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన వారికి వాటర్ ట్యాంకుల ద్వారా ప్రత్యేకంగా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

సిఫార్సులకే రుణాలు!

- ఎమ్మెల్యేల ద్వారా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లకు బిసి కార్పొరేషన్ లబ్ధిదారుల పేర్లు?
- గ్రామాల వారీగా కూటమి పార్టీల వారికి మంజూరు
- అర్హులకు మొండిచేయి
- అధికార పార్టీల మధ్య కుమ్ములాటలు

కులం, మతం, జాతి, లింగ వివక్ష లేకుండా పనిచేస్తామని అసెంబ్లీ సాక్షిగా రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు మాట తప్పుతున్నారా? ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులను ఎంపిక చేయాల్సిన శాసనసభ్యులు... తమ మద్దతుదారులకు బిసి కార్పొరేషన్ రుణాల్లో పెద్దపీట వేస్తున్నారా? ఇప్పటికే మంజూరు చేసే రుణాలపై సంబంధిత అధికారులకు సిఫార్సు లేఖలు అందజేశారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా బిసి కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక చర్చనీయాంశంగా మారింది. దీనిపై కూటమి పార్టీల్లోనూ కుమ్ములాటలు మొదలైనట్టు బోగట్టా.

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిసి కార్పొరేషన్ ద్వారా అర్హులైన బిసిలకు రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం గత నెలలో ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా అనేక మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లు 3379 మాత్రమే. అయినా, జిల్లా వ్యాప్తంగా 20,449 మంది రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. మండలాల వారీగా ఎంపిడిఒ కార్యాలయాల్లో బ్యాంకు సిబ్బందిని పిలిపించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ సమయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు, ఫొటోలతో కూడిన మూడు సెట్ల జిరాక్సులతో హాజరయ్యారు. ఇంటర్వ్యూను తూతూ మంత్రంగా నిర్వహించారు. ఒక్కో లబ్ధిదారుడు సుమారు రూ.300 వరకు ఖర్చు చేశారు.

ఆ లెటర్లకే ప్రాధాన్యత!

జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు సిఫార్సుల లేటర్లలో పేర్లు ఉన్న వారిని మాత్రమే అధికారులు ఎంపిక చేసినట్లు తెలిసింది. గ్రామానికి నాలుగో ఐదో యూనిట్లకు గాను టిడిపికి చెందిన నలుగురు, జనసేన పార్టీకి చెందిన వారిని ఒకరిని ఎంపిక చేసినట్లు సమాచారం. మండలాల్లో ఎంపిడిఒలకు, మున్సిపాలిటీలో కమిషనర్లకు ఎంపిక బాధ్యతలు అప్పగించారు. బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలకు అర్హులు చాలా మంది ఉన్నప్పటికీ కొద్దిమందిని ఎంపిక చేయడం పట్ల చాలావరకు అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి.

జనాభా ఎక్కువ..

ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనుకబడిన సామాజిక తరగతి ప్రజలు ఎక్కువగా నివశిస్తున్నారు. ఇందులో విజయనగరం జిల్లాలో బిసిలు అధికం. అటువంటి జిల్లాలో కూడా లబ్ధిదారుల ఎంపిక తక్కువగా నమోదు చేయడం పట్ల బిసి సంఘాలు మండిపడుతున్నాయి. జిల్లాలో యూనిట్లు మంజూరు పెంచితే మంచిదని వారు అభిప్రాయ పడుతున్నారు

కూటమిలో విభేదాలు

జిల్లాలో బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన పథకాల్లో కూటమి పార్టీల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. టిడిపి, జనసేన, బిజెపిలకు గ్రామాల్లో సానుభూతిపరులు ఎక్కువగా ఉండడం, రుణాల యూనిట్లు తక్కువ మందికి మంజూరు కావడంతో విభేదాలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా బిసిలు ఎక్కువగా ఉండడం, అందుకనుగుణంగా దరఖాస్తులు రావడంతో న్యాయం చేయలేకపోతున్నామన్న భావనలో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు. ఈ విషయం కాస్తా అధిష్టానం వద్దకు చేరడంతో యూనిట్ల సంఖ్య పెంచే దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

అదేం లేదు

జిల్లాలో బిసి కార్పొరేషన్ యూనిట్లకు గాను ఎటువంటి రాజకీయ సిపార్సులు, ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయలేదు. బ్యాంకులకు పంపిన లబ్ధిదారులు జాబితా కూడా నిలిపేశాం. బిసి కార్పొరేషన్ ద్వారా బిసిలకు మంజూరైన రుణాలకు రివైజ్డ్ గైడ్ లైన్స్ వస్తాయి.

– పెంటోజీరావు, జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి

ఇదీ రుణాల పరిస్థితి

2024-25లో బిసి కార్పొరేషన్‌లో నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. బిసి కార్పొరేషన్‌లో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్‌కు ఆన్‌లైన్‌లో 18,371 దరఖాస్తులు రాగా, 2883 నేరుగా దరఖాస్తులు అందజేశారు. ఇందులో 2078 దరఖాస్తులను బ్యాంకులకు పంపగా 517 మందికి మాత్రమే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు అంగీకరించాయి. బిసి కార్పొరేషన్ ద్వారా జనరిక్ ఫార్మసీకి ఆన్‌లైన్ 52 దరఖాస్తులు రాగా, 58 యూనిట్లు మంజూరయ్యాయి. బ్యాంకులకు 8 దరఖాస్తులు పంపగా ఇంతవరకు బ్యాంకులు ఆమోదం తెలపలేదు. మేదర, కుమ్మర, శాలివాహన సామాజిక తరగతుల యూనిట్లకు ఆన్‌లైన్‌లో 175 దరఖాస్తులు రాగా, 219 యూనిట్లు మంజూరయ్యాయి. వీటితోపాటు ఇబిసి, కమ్మ కార్పొరేషన్, రెడ్డి కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్, బ్రాహ్మణ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్‌కు యూనిట్లు మంజూరయ్యాయి.

జగన్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వొద్దు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు
- విజయనగరం జిల్లాను టిడిపికి అడ్డాగా మార్చాలి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గత వైసిపి ప్రభుత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, మరోసారి జగన్‌ను అధికారంలోకి రాకుండా చూడాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. బుధవారం నగరంలోని మొసానిక్ టెంపుల్‌లో టిడిపి జిల్లా మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపట్టినా, అక్రమంగా అరెస్టు చేశారన్నారు. సీనియర్ నాయకులు కళావెంకట్రావును సైతం అక్రమ అరెస్టు చేశారన్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అవినీతి సొమ్ముతో ప్యాలస్‌లు కట్టారని విమర్శించారు. విశాఖపట్నంలో కట్టిన ప్యాలస్‌ను దేనికి ఉపయోగించాలో ఈ ప్రభుత్వానికి అర్థం కావడం లేదన్నారు. విజయనగరంలో ఉగ్రలింకులు ఎప్పుడూ చూడలేదని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం ఉన్నచోట ఇలాంటివి జరుగుతాయని, గత ప్రభుత్వంలో డ్రగ్స్ వినియోగమే అందుకు కారణమని ఆరోపించారు.

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కోటి మంది సభ్యత్వం ఉన్న పార్టీ టిడిపి అన్నారు. రాష్టానికి పెట్టుబడులు వస్తున్నాయని, 8 లక్షల కోట్లు పెట్టుబడులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకు వచ్చారని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రతి ఇంటికీ ఒక వ్యాపారవేత్తను తయారు చేస్తున్నారన్నారు. నారా లోకేష్ పార్టీ కోసం పని చేసిన వారికి మాత్రమే పదవులు ఇస్తున్నారన్నారు. అందరం సమిష్టిగా పని చేసి విజయనగరం జిల్లాను టిడిపి అడ్డాగా తయారు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట రావు, జోనల్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యేలు పూసపాటి అదితి గజపతి రాజు, బేబినాయన, కొండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, నాయకులు సుజయ్‌కృష్ణ రంగారావు, కె.ఎ.నాయుడు, గద్దె బాబూరావు, ఐవిపి రాజు, కిమిడి మల్లిక్ నాయుడు, కరణం శివరామకృష్ణ, చౌదరి అవినాష్, మహంతి చిన్నం నాయుడు, ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, బొద్దుల నరసింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, నాయకులు

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్

యోగాంధ్రకు శ్రీకారం

యోగా జీవితంలో భాగం కావాలి : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

యోగాంధ్ర సాధనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన యోగాభ్యాస కార్యక్రమానికి జిల్లాలో బుధవారం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా నెల రోజులపాటు నిర్వహించనున్న యోగా మంత్ కార్యక్రమాన్ని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో యోగాభ్యాస కార్యక్రమాన్ని కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, జెసి ఎస్.సేతు మాధవన్ ప్రారంభించారు. ఇందులో వందలాది మంది ప్రజలు యోగాసనాలు వేశారు. కలెక్టర్, జెసి, ఇతర ఉన్నతాధికారులంతా యోగాభ్యాసన చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని కోరారు. జూన్ 21న విశాఖలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి మోడీ రావడం ఎంతో గౌరవదాయకమని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారానికో ప్రచార కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొదటి వారం జిల్లా స్థాయిలో, రెండో వారం మండల స్థాయిలో అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. వారి ద్వారా మూడో వారం జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవల అరకులో నిర్వహించి, ప్రపంచ రికార్డు సాధించిన మెగా యోగా కార్యక్రమం మహా సూర్యవందనంలో జిల్లా నుంచి పాల్గొన్న వారికి ఈ సందర్భంగా కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వర్రావు, ఆయుష్ వైద్యాధికారులు వరప్రసాద్, ఆనందరావు, స్వప్న చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ మామిడి

- రసాయనాలతో మగ్గబెడుతున్న వైనం
- అధికారుల తనిఖీలో వెలుగులోకి..

బంగారు వర్ణంలో మధుర ఫలం మామిడిని చూస్తే నోరూరుతుంది. పచ్చగా మెరిసిపోయే పండ్లను చూస్తే కొనాలనిపిస్తుంది. కనువిందు చేసే పండ్లు తింటే ఆరోగ్యంపై ఆశలు వదులుకోవాల్సి ఉంటుంది. విష రసాయనాలతో కృత్రిమంగా తయారవుతున్న ఈ పండ్లు తింటే తప్పక ఆరోగ్యం గుల్లవుతుంది. కాసుల కోసం స్వార్థ వ్యాపారులు పక్వానికి రాక ముందే మామిడి కాయలను కోసి రసాయనాలతో పండ్లు తయారు చేసి విక్రయిస్తుంటే.., అరికట్టేందుకు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.

ప్రజాశక్తి-గంట్యాడ, కంటోన్మెంట్

పండ్లకు రారాజు మామిడి పండు. వేసవిలో మాత్రమే దొరికే ఈ పండుకోసం ఏడాదంతా ఎదురుచూస్తుంటారు. వేసవి వచ్చిందంటే ప్రతిఒక్కరూ తీసుకునే పండ్ల జాబితాలో మామిడి తప్పక ఉంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మామిడి దిగుబడి తక్కువగా ఉండటంతో మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి, వాటిని కృత్రిమ పద్ధతిలో మగ్గబెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. అధికారుల తనిఖీల్లో ఈ విషయం కాస్తా మరోసారి వెలుగులోకి వచ్చింది. కృత్రిమంగా రసాయనాలు పిచికారీ చేయడం ద్వారా మగ్గబెట్టిన పండ్లు ఆరోగ్యానికి హానికరమని చెబుతున్నారు.

సాధారణంగా మామిడి కాయ పండటానికి చాలా రోజులు సమయం పడుతుంది. ఈ క్రమంలో కొన్ని కుళ్లిపోవడం జరుగుతుంది. ఆ నష్టాన్ని తగ్గించుకునేందుకు వ్యాపారులు రసాయనాలు వినియోగిస్తున్నారు. రసాయనాలు వినియోగించడం ద్వారా 24 గంటల నుంచి 48 గంటల్లో కాయరంగు మారిపోతుంది. అందుకోసం ఇపి 50 రిపోన్, ఈథ్ ఫోన్ 30 ఎస్.ఎల్ ఇపి-50 అనే కెమికల్ ద్రావకాలను ఉపయోగిస్తున్నారు. దానిలో మామిడి కాయలను ముంచి, లేదా మామిడికాయలపై స్ప్రే చేయడం వల్ల అది మంచిరంగు వచ్చిన తరువాత మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు. వీటివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. గతంలో దీని వినియోగం చాలా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు కాస్త తగ్గినప్పటికీ కొన్నిచోట్ల వ్యాపారులు వినియోగిస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

అధికారుల తనిఖీలు

మామిడిపండ్ల నిల్వ ప్రాంతాల్లో విజిలెన్స్, ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా బుధవారం గంట్యాడ మండలం రామవరంలో కాకర్లపూడి రామకృష్ణరాజు, సిరిపురపు శివ ఇళ్లవద్దనున్న గదుల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించారు. వారు పండించిన మామిడి కాయలకు మంచి రంగు రావడానికి, ఆకర్షణీయంగా కనపడటానికి ఇపి 50 రిపోన్, ఈథ్ ఫోన్ 30 ఎస్ఎల్ ఇపి-50 రసాయనాలను ఉపయోగించినట్లు గుర్తించారు. కృత్రిమంగా కెమికల్స్ వాడి మామిడికాయలు పండించరాదని, అలా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆహార భద్రత అధికారులు కెమికల్ స్ప్రే చేసిన మామిడికాయల నమూనాను సేకరించి వాటిని రసాయన పరీక్ష నిమిత్తం హైదరాబాద్ పంపించారు. వచ్చే రిపోర్ట్ ఆధారంగా పై వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ సింహాచలం, హెచ్‌సి కామేశ్వరరావు, పిసి పురుషోత్తం, ఆహార భద్రత అధికారులు పాల్గొన్నారు.

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు

రసాయనాలు కలిపిన పండ్లను తీసుకోవడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లను తీసుకున్న వెంటనే జీర్ణ సంబంధ సమస్యలు కనిపిస్తే, దీర్ఘకాలంలో ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే అవకాశముందని చెబుతున్నారు. కృత్రిమంగా ఎసిటిలిన్ గ్యాస్ వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తీసుకుంటే కేన్సర్ బారినపడే అవకాశముంది. రసాయనాలు కలిగిన పండ్లను తినడం వల్ల తలనొప్పి, మైకం, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి, సెరిబ్రల్ ఎడిమా వంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

రామవరంలో మామిడి పండ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

కలెక్టర్ చొరవతో జిల్లాకు సిఎస్ఆర్ నిధులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం సిఎస్ఆర్ కింద నిధులు సమకూర్చేందుకు పలు కంపెనీలు ముందుకొచ్చాయి. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చొరవతో అనేక అభివృద్ధి కార్యక్రమాల కోసం సిఎస్ఆర్ నిధులు కేటాయించాయి. ప్రధానంగా విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించాయి. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. మెడికల్ కళాశాలలో వైద్య పరికరాల కోసం రూ.కోటి మంజూరు చేసింది. పూసపాటిరేగ మండలంలో నడిపల్లి, చింతపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు కోసం రూ.54.50 లక్షలను ఈ కంపెనీ మంజూరు చేసింది. భారత్ డైనమిక్ లిమిటెడ్ కంపెనీ క్లాస్ రూమ్ ప్రాజెక్ట్ కోసం 37 ప్రభుత్వ పాఠశాలలకు కోటి రూపాయలు, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కోసం రూ.14.50 లక్షలు, గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరికరాల కోసం రూ.7.16 లక్షలు మంజూరు చేసింది.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నడుపుతున్న బ్లడ్‌బ్యాంకుకు జనరేటర్ కోసం రూ.11.34 లక్షలను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ విడుదల చేసింది. బధిర బాలికల కోసం 45 బంకర్ బెడ్స్‌ను, 4 ఆర్‌ఒ ప్లాంట్లను కూడా మంజూరు చేసింది. చంపావతి నదీ పరివాహిక ప్రాంతంలోనున్న నెల్లిమర్ల, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 40 చెరువుల అభివృద్ధికి రూ.15 కోట్లను యాక్సిస్ బ్యాంకు సిఎస్ఆర్ కింద మంజూరు చేసింది.

కరాటేలో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పిజి కళాశాలలో కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పతకాల పంట పండింది. ఇటీవల విజయనగరంలో రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 18వ జిల్లా కరాటే ఛాంపియన్ షిప్-2025లో బాలబాలికలు ఘన విజయం సాధించారు. కె.స్నేహ, ఎన్.దేవాన్ష్‌నాయుడు రెండేసి చొప్పున బంగారు పతకాలు కైవశం చేసుకున్నారు. కె.భువన కృతి (బంగారు, రజతం), పి.హేమంత్ (బంగారు, రజితం), పి.కుశ్వంత్ కుమార్ (బంగారు, కాంస్యం), జి.తిరుమల (బంగారు, కాంస్యం), ఎల్.జశ్వంత్ (రజతం, కాంస్యం), జి.వివేక్‌వర్మ (రజతం, కాంస్యం), ఆర్.వైష్ణవి, కె.శివగణేష్, ఎం.హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, కోచ్ కె.సంతోష్ కుమార్, అసిస్టెంట్ కోచ్ సుధీర్ భార్గవ్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన వారితో సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

ఆరుగురికి ఉద్యోగోన్నతులు

విజయనగరం : కార్యాలయ సహాయకులుగా పనిచేస్తున్న ఆరుగురికి రికార్డు సహాయకులుగా ఉద్యోగోన్నతి లభించింది. ఖాళీగా ఉన్న రికార్డు సహాయకుల పోస్టులకు వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్యాలయ సహాయకులు సిహెచ్.సీతమ్మ, టి.రాములు, డి.రామస్వామి, ఆర్.సింహాచలం, జి.వెంకటరత్నం, ఎం.వెంకటరమణకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ మేరకు బుధవారం జెడ్‌పి చైర్మన్ ఛాంబర్‌లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్ రామన్, ఎఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర జిల్లా నోడల్ అధికారిగా సతీష్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చొరవకు జిల్లా నోడల్ అధికారిగా సీతం కళాశాల ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జెఎన్‌టియు-జివి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌ను సీతం కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అభినందించారు.

'జయంతి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రంథాలయోద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణమూర్తి వర్ధంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఘనంగా నివాళు లర్పించింది. బుధవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని రామలక్ష్మణ మూర్తి విగ్రహానికి సంఘం అధ్యక్షులు కె.ఎర్నాయుడు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, ఉపాధ్యక్షులు కె.దయానంద్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలపై అవగాహన కల్పించేందుకు, పుస్తకపఠనం పెంపొందించేందుకు జయంతి రామలక్ష్మణ మూర్తి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గురజాడ గ్రంథాలయ సిబ్బంది శ్రీనివాస్, అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేల కూలిన మహావృక్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మహారాజా సంగీత నృత్య కళాశాల ఆవరణలో ఉన్న ఎన్నో ఏళ్ల నాటి మహావృక్షం బుధవారం నేలకొరిగింది. చెట్టు మొదళ్లలో చెదలు పట్టి పుచ్చిపోయింది. దీంతో కొద్దిపాటి తేలిక వర్షానికి మహావృక్షం కూలిపోయింది. దీంతో సంగీత కళాశాల ప్రహరీ ధ్వంసమైంది. గోడకు అనుకొని ఉన్న మూడు దుకాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మహావృక్షం నేల కూలిందన్న సమాచారం తెలుసుకున్న కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. సిబ్బంది వృక్షాన్ని ముక్కలుగా చేసి రహదారికి అడ్డంకులు లేకుండా చేశారు. ఈ ప్రక్రియను కమిషనర్ పల్లి నల్లనయ్య దగ్గరుండి పర్యవేక్షించారు.

చెట్టు తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలంలోని గొల్లలపేట గ్రామానికి చెందిన బూర రమణ (ఎంపిటిసి), ఈగల రమణ (మాజీ ఉపసర్పంచ్), బూర అప్పలనాయుడు, బూర మంగ (వార్డు సభ్యులు), బూర చినసత్యం, బూర భాస్కర్‌రావు తదితరులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. బుధవారం నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి అశోక్ పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి గంటా పొలినాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, ప్రసాదుల కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాలకే పరిమితమైన సహకారం

◆సంకిలి, రేగిడి, వంగర సహకార సొసైటీలకు పక్కా భవనాలు కరువు ◆ఇరుకు గదుల్లో విధులు ◆ ఇబ్బందులు పడుతున్న సిబ్బంది ◆పక్కా భవనాలు, గోదాములకు ప్రతిపాదనలు గాలికి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, రేగిడి వ్యవసాయ ప్రాథమిక సహకార సొసైటీలు అద్దె భవనాల్లోనే కొనసాగడంతో సిబ్బంది, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సొసైటీలకు పక్కా భవనాల నిర్మాణాలకు జాప్యం ఎందుకో అధికారులకే ఎరుకని రైతులు విమర్శిస్తున్నారు. ఈ సహకార సొసైటీలకు 39 గ్రామపంచాయతీలలో 13 గ్రామపంచాయతీలకు సంకిలి సొసైటీలో సుమారు 3,868 మంది రైతులు, రేగిడి సొసైటీకి 26 గ్రామపంచాయతీలకు 15,608 మంది రైతులకు సహకారం అందిస్తుంది. అద్దె భవనాలలో సొసైటీలు ఉండడంతో ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సొసైటీలకు పక్కా భవనాలు లేక అద్దె కొంపలోనే కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు లేకపోవడంతో రైతులకు ఖరీఫ్ రబీ వ్యవసాయానికి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర వస్తు సామాగ్రి ఉంచేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారినా సొసైటీల దిశ, దశలు మారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> నియోజకవర్గంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సొసైటీ అద్దె భవనాల్లోనే కొనసాగడంతో రైతులు, సిబ్బంది నానా పాట్లు పడుతున్నారు. ఖరీఫ్, రబీ వ్యవసాయ పంటలకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర వస్తు సామాగ్రి దాచేందుకు సొసైటీలకు పక్కా భవనాలు, గోదాములు లేక రైతులకు సకాలంలో అందించలేక తంటాలు పడుతున్నారు. వేలాది రూపాయలు అద్దెలు చెల్లిస్తున్న ప్రభుత్వం సొంత భవనాలపై దృష్టి సారించకపోవడంతో ప్రజాధనం వృథా కావడంతో పాటు అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో విధులు నిర్వహించాల్సి వస్తుందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎరువులు, విత్తనాలకు వచ్చిన రైతులకు కూడా కూర్చునేందుకు చోటు లేక అవస్థలు పడుతున్నారు.

తీర్మానాలు చేసినా?

సంకిలి సొసైటీకి 2014లో అప్పటి సొసైటీ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు సొసైటీ పక్కా భవనానికి, గోదాం నిర్మాణాలకు సర్వే నంబర్ 319లో 22 సెంట్లు భూమిని కేటాయించాలని సభ్యులు తీర్మానం చేసి రెవెన్యూ అధికారులకు, సొసైటీ జిల్లా అధికారులకు నివేదికలు పంపించారు. రేగిడి సహకార సొసైటీకి సంబంధించి అప్పటి అధ్యక్షుడు దూబ ధర్మారావు పక్కా భవనానికి గుల్లపాడు పంచాయితీలో పోలీస్ స్టేషన్ సమీపంలో 20 సెంట్లు భూమిని కేటాయించాలని అప్పటి సభ్యులతో తీర్మానం చేసి నివేదికలు పంపించారు. ఆ నివేదికల ప్రాప్తికి కేంద్ర సహకార అధికారులు స్థలం సేకరణకు రెవెన్యూ అధికారులకు నివేదికలు పంపారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి సర్వేయర్లు పంపించారు. కొలతలు వేసి మార్కింగ్ వేశారు. వాటికి రెవెన్యూ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇవన్నీ జరిగినా రాజకీయంగా సొసైటీలకు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులు చేయడంతో పనులకు కార్యరూపం దాల్చలేదు.

వంగర మండల కేంద్రంలో ఉన్న సహకార సొసైటీ అద్దె భవనంలోనే కొనసాగుతుంది. సంతకవిటి మండల కేంద్రంలో సహకార సొసైటీ పక్కా భవనం ఉన్న శిథిలంలో ఉంది. రాజాం మండల కేంద్రంలో సహకార సొసైటీలు పక్కా భవనాలలె ఉన్నా అవి కూడా శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా సొసైటీ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి సహకార సొసైటీల పక్కా భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి

సంకిలి సహకార సొసైటీకి పక్కా భవనాలు నిర్మించాలి. సొసైటీకి పక్కా భవనంతో పాటు గోదాములు లేక రైతులు సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సొసైటీకి 13 గ్రామపంచాయతీలకు సంబంధించి రైతులు వస్తుంటారు. సొసైటీ వద్ద వసతులు లేక పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి పక్కా భవనాలు మంజూరు చేయాలి.

నారు సింహాద్రి నాయుడు, మాజీ అధ్యక్షులు, సంకిలి సొసైటీ

నిర్మాణాలకు జాప్యం ఎందుకో

సహకార సొసైటీ నిర్మాణానికి అధికారులు జాప్యం చేయడం తగదు.

అద్దె భవనంలో నడుస్తున్న రేగిడి సొసైటీ..

ఎన్నో ఏళ్ల నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతుంది. గోదాం లేక విత్తనాలు, ఎరువులు ఉంచేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పాలకులు, అధికారులు మారినా భవన నిర్మాణానికి కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం సొసైటీకి 22 సెంట్లు భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. సొసైటీని కాపాడుకునే బాధ్యత రైతులపై ఉంది. అర్జీలు ఇచ్చినా భవన నిర్మాణాలకు అధికారులు స్పందించకపోవడం విడ్డూరం.

నారు జనార్ధన రావు, నీటి సంఘం అధ్యక్షులు, సంకిలి.

సొసైటీకి స్థల సేకరణ నా దృష్టికి రాలేదు.

సంకిలి సొసైటీకి పక్కా భవనాలకు స్థలం సేకరణ నా దృష్టికి రాలేదు. నేను ఇటీవల ఇంచార్జి బాధ్యతలు చేపట్టాను. ఆ విషయం నాకు తెలియదు. ఫైలు ఆఫీసులో ఉంటుంది. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఫైలు తీసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందిస్తాం.

బి.ఈశ్వరరావు, తహశీల్దార్, రేగిడి

షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న విద్యార్థి

ప్రజాశక్తి - భోగాపురం

పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఏపి మోడల్ స్కూల్ విద్యార్థి కొయ్య హరీష్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. దల్లి పేట పంచాయతీ గాలిపేట గ్రామానికి చెందిన కొయ్య హరీష్ మోడల్ స్కూల్లో పదో తరగతిలో 593 మార్కులను సాధించాడు. అత్యధిక మార్కులు సాధించిన వారికి షైనింగ్ స్టార్ అవార్డు పేరుతో అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవార్డుకు విజయనగరం జిల్లా నుంచి హరీష్ ఎంపికయ్యారు. ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా తల్లిదండ్రులతో కలిసి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి, ఎంఇఒ బాలిపల్లి చంద్రమౌళి, ఉపాధ్యాయులు హరీష్‌ను అభినందనలు తెలిపారు.

గజపతినగరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో వేడిగాలి నుంచి ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం కలిగింది. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో మండల కేంద్రంలో మెంటాడ రోడ్డు, రైతు బజారు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ.. భారీ వర్షం కారణంగా ఖరీఫ్ పంటకు భూమి చదును చేసుకోవడానికి, దుక్కులకు, వేసవి పంటలు వేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.

టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్రంలో టిడిపితోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని కూటమి హయాంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా టిడిపి జెండా ఎగుర వేసేలా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. సమావేశంలో బుడా చైర్మన్ తెంటు రాజా, టిడిపి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, మున్సిపల్ చైర్మన్ శరత్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

ప్రజాశక్తి- కొత్తవలస

ఈ నెల 23న స్థానిక ప్రగతి డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో ప్రముఖ ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, సాఫ్ట్వేర్‌కు సంబంధించి సుమారు 25 కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఫార్మసీ, బి.బి.ఎ, ఎం.బి.ఎ, ఎ.ఎన్.ఎం, జి.ఎన్.ఎం, బి.ఎస్సీ-నర్సింగ్ చదివిన వారు తమ ఫోటోపాటు ఒరిజినల్ సర్టిఫికేట్లు, జెరాక్స్ కాపీలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

టిడిపి మండల అధ్యక్షులుగా కామునాయుడు

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రౌతు కామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళ వెంకటరావు మండల పార్టీ అధ్యక్షుడిగా కామునాయుడుని నియమిస్తున్నట్లు మంగళవారం రాత్రి ప్రకటించారు. కాగా రౌతు కామునాయుడు తెలుగుదేశం పార్టీలో 2004లో చేరారు. అనంతరం చీపురుపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా 2007 వరకు పనిచేశారు. 2008 నుండి 2012 వరకు చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. 2013లో విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించబడ్డారు. తిరిగి 2014 నుండి నేటి వరకు చీపురుపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. తాజాగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మండల కమిటీలు వేయడంతో రౌతు కామునాయుడుని ఎనిమిదవ సారి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు నియమించారు. దీంతో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, కామునాయుడి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్‌పై 16 వారాల శిక్షణ బుధవారంతో ముగిసింది. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, మెకానికల్ విభాగాధిపతి దీపక్ కుమార్, ఐటిఐ ప్రిన్సిపల్ టి.వి.గిరి చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ నాలుగు నెలల్లో ఇండస్ట్రీ 4.0, డ్రోన్లు, స్టార్టప్, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై శిక్షణనిచ్చినట్లు ప్రొఫెసర్ రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రంజన్ కుమార్ బెహరా, ఎ.కె.జెనా, ఉపాధ్యాయులు రమణాచారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చరిత్రను ప్రజలకు అందిస్తాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అంబేద్కర్ పోరాట చరిత్రను ప్రజలకు అందిస్తామని ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఎవరు ఆయన ఏం చేశారు అనే పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరంలో 50 వేల పుస్తకాలను ప్రజలకు అందిస్తామన్నారు. మతములన్ని మాసిపోవును కులములన్ని కూలుపోవును జ్ఞానమొక్కటే మిగులుపోవును అని అంబేద్కర్ ఆశయాలు కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, ఉద్యమనాయకులు డప్పురాజు, బోనెల ఈశ్వరరావు, కపరెడ్డి వెంకట అప్పారావు, మెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంపై ఆగ్రహం

ప్రజాశక్తి - బొబ్బిలి

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంపై మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కుమ్మరివీధి సచివాలయం పరిధిలోని పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. రోడ్లుపై చెత్త, కాలువలలో పూడికలు ఉండడంతో వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లుపై ఉన్న చెత్తను, కాలువలలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - బొబ్బిలి

కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు బి.సాయికృష్ణ, ఎల్.జగన్నాథం, జి.వెంకటనాయుడు, పి.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం, కొండ వెలగాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వ్యసాయం కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున ఈ నెల 22న గురు వారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి. త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి 11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు, కొండవెలగాడ 33/11/ కెవి సబ్ స్టేషన్ పరిధిలో కొండవెలగాడ ఎస్ఎస్‌హెచ్‌క్యూ ఫీడర్, పారసాం 11కెవి రూరల్ ఫీడర్, లైన్ కింద ఆర్‌డిఎస్ఎస్ వ్యసాయం కనెక్షన్ పనులు, చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలు వాటిని సరి చేయడం వల్ల ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పారసాం, గెద్దపేట, చినబూరాడ పేట, గుర్ల మండలంలోని నడుపూరు, భూపాలపురం, ఆనందపురం గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

కార్యకర్తలను పట్టించుకోరా?

◆తిరంగా ర్యాలీలో కానరాని లోకల్ నాయకత్వం ◆ మినీ మహానాడుకూ గైర్హాజరు ◆పట్టించుకోని ఇన్‌ఛార్జిపై పెదవి విరుపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పార్టీని, కార్యకర్తలను పట్టించుకోరా? అని టిడిపి శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ సీటును సైతం త్యాగం చేస్తే ప్రభుత్వం ఏర్పడ్డాక కనీసం కార్యకర్తలను కూడా పట్టించుకోలేదని టిడిపి మండల నాయకులు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 9 నెలలుగా కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో కొన్ని కార్యక్రమాలకు కూడా బాయ్ కాట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఇటీవల తిరంగా ర్యాలీలో నెల్లిమర్ల టిడిపి నాయకులు కనిపించకపోవడమే దీనికి తార్కాణం, అంతకముందు సాక్షాత్తు ప్రధానమంత్రి మోడి విశాఖపట్నం వచ్చినప్పుడు సభకు వెళ్లకుండా వచ్చిన బస్‌లను తిరిగి పంపించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఎమ్మెల్యే టిడిపిని పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుంటున్న సందర్భంలో మరింత రగిలిపోతున్నట్లు సమాచారం. కాగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూడా టిడిపి పట్ల వివక్ష చూపించడం, అధికార్లు సైతం టిడిపి నేతల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపించడం మరింత ఆవేదనకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన రేషన్ డీలర్ ఎంపికలో టిడిపికి సంబంధించి ముగ్గురు డీల్లర్లను తొలగించి వైసిపి మద్దతు దార్లకు డీలర్ పోస్టులు కేటాయించడం వంటి సంఘటనలు టిడిపి శ్రేణులకు మింగుడు పడడం లేదు. గత

వైసిపి హయాంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులు నెల్లిమర్ల మండలానికి ప్రాధాన్యత ఉండేదని ప్రస్తుతం టిడిపి వచ్చిన తరువాత నెల్లిమర్ల మండలానికి ప్రాధాన్యత లేకుండా పోయిందని బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోనే నెల్లిమర్ల మండలంలో పలు గ్రామాలు టిడిపికి కంచుకోటగా నిలిచిన విషయం తెలిసిందే. అటువంటి గ్రామాలను సైతం అండగా నిలవాల్సిన నియోజకవర్గం ఇంచార్జి కూడా తమను పట్టించుకోవడం లేదన్న నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. అధిష్టానం పట్టించుకోకపోవడం వల్ల కొంతమంది బిజెపిలోకి చేరడం వంటి సంఘటనలూ చోటుచేసుకున్నాయి. పార్టీని, కార్యకర్తలపై దృష్టి పెట్టి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే టిడిపికి భవిష్యత్తు అందకరంగా మారుతుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం, జిల్లా నాయకత్వం నెల్లిమర్ల మండలానికి ప్రాధాన్యతనిచ్చి టిడిపి శ్రేణులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మినీ మహానాడుకు దూరం

టిడిపి నెల్లిమర్ల మండల నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న వాదనకు బలం చేకూరుస్తూ ఇటీవల పూసపాటిరేగ మండల కేంద్రంలో జరిగిన టిడిపి మినీ మహానాడుకు నెల్లిమర్ల మండల నాయకులు దూరంగా ఉన్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మండల నాయకులు సువ్వాడ రవిశేఖర్, వనజాక్షితోపాటు కడగల ఆనంద్, గేదెల రాజారావు లాంటి నాయకులంతా మినీ మహనాడుకు హజరుకాలేదు. టిడిపి తమను గుర్తించడం లేదని చెప్పినట్లు సమాచారం. కడగల ఆనంద్‌కు డిసిసిబి అధ్యక్షులుగా పదవి వస్తుందని ఆశించారు. కానీ ఆ పదవిని వేరొకరికి ఇవ్వడంతో నిరాశకు గురైనట్లు తెలుస్తుంది. గేదెల రాజారావుకు ఎఎంసి ఇవ్వాలని కోరినా దానికి నిరాకరించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండల కేంద్రంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారు జామున రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఓ ప్రైవేట్ జ్యూస్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణం నష్టం జరగలేదని, లేదంటే భారీ ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాద సమాచారం అందిన వెంటనే గజపతినగరం ఫైర్ స్టేషన్ ఎస్ఐ రవిప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని వారి సిబ్బందితో మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో దుకాణంలో ఫర్నిచర్ పూర్తిగా కాలిపోవడంతో రూ.50వేల వరకూ ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -పూసపాటి రేగ

బెల్టుషాపులపై దాడుల్లో భాగంగా బుధవారం మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన వ్యక్తిని 9 మద్యం సీసాలతో అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని భోగాపురం ఎక్సైజ్ సిఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారి మద్య దుకాణాలు (బెల్ట్ షాపులు) నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సురేష్, కానిస్టేబుల్ మహేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కుంగిపోతున్న కల్వర్టు

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

● పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఆర్ ముంగినాపల్లి సమీపంలో విజయనగరం నుంచి కుమిలి వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డులో కల్వర్టు రోజు రోజుకూ కుంగిపోతుంది. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏమి జరిగినా మాకేమిటన్న చందంగా ఆర్‌అండ్‌బి అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డులో విజయనగరం నుంచి శ్రీకాకుళం వైపునకు వెళ్లడానికి, కంపెనీలకు వెళ్లడానికి జాతీయ రహదారికి చేరుకోవడానికి దగ్గరి కావడంతో ఈ రోడ్డులో వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కల్వర్టు కుంగిపోయి ఉండటంతో మంగళ, బుధవారాలు రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మొదటి రోజు మోటార్ సైకిల్‌పై విజయనగరం వైపు వస్తున్న వ్యక్తి కుంగిపోయిన కల్వర్టును గమనించకపోవడంతో వేగంగా వచ్చి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం కూడా మరో వ్యక్తి మోటార్ సైకిల్ పై వస్తూ కల్వర్టును గమనించకపోవడంతో ఒక్కసారిగా మోటారు సైకిల్‌తో సహ బయటకు తుళ్లిపడిపోయాడు. దీంతో తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తిని 108 ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు మార్గంలో భారీ వాహనాలు కూడా ప్రయాణించడంతో కల్వర్టు మరింత కుంగిపోతుంది. పెద్దతాడివాడ వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ యార్డ్‌కు ఈ రోడ్డు గుండానే 20 నుంచి 30 టన్నుల లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. ముఖ్యంగా ఆర్ ముంగనాపల్లి వద్ద మిక్సింగ్ కాంక్రీట్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఈ కంపెనీ నుంచి కాంక్రీట్‌ను మిక్సింగ్ చేసి భారీ లారీలతో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందువల్లే రోజు రోజుకి కల్వర్టు కుంగిపోతుందని వాహనదారులు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టుకు మరమ్మత్తు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కల్వర్టును బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్ని సౌకర్యాలూ ఉండేలా డిజైన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోటలో నూతన కోర్టు భవన నిర్మాణంలో అన్ని సౌకర్యాలూ ఉండేలా డిజైన్ రూపొందించాలని రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశించారు. ఎస్.కోట పట్టణంలో ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె కోర్టు భవనం, శిథిలమైన పాత కోర్టు భవనాలు, మేజిస్ట్రేట్ క్వార్టర్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత బుధవారం పరిశీలించారు. కోర్టు భవనం పరిశీలనకు వచ్చిన జిల్లా జడ్జికి ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి ఆర్ అండ్ బి ఇంజినీర్లు కోర్టు నూతన భవనం, మేజిస్ట్రేట్ క్వార్టర్ నిర్మాణానికి రూపొందించిన డిజైన్లను జిల్లా జడ్జి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన కోర్టు ప్రాంగణంలో ఫిజికల్లీ చాలెంజ్ కోసం ప్రవేశ ద్వారం, ట్రాన్స్ జెండర్లు, ఫిజికల్లీ ఛాలెంజ్ వ్యక్తులకు ప్రత్యేక టాయిలెట్స్, న్యాయవాదులు, కక్షిదారుల వాహనాల పార్కింగ్ కోసం సౌకర్యాలు ఉండేలా చూడాలని ఇంజినీర్లకు సూచించారు. ఇక నూతన కోర్టు భవనాలకు రూ.8.5కోట్లు, మేజిస్ట్రేట్ నివాస గృహం కోసం రూ.2.23కోట్లు, పాత భవనాల తొలగింపును కోసం రూ.7లక్షల నిధుల కేటాయింపు కోసం ప్రస్తుత డిజైన్లు రూపొందించామని ఆర్ అండ్ బి ఇంజినీర్లు ఎస్.కోట సెక్షన్ ఏఈ స్వామి, ఎల్.కోట సెక్షన్ ఏఈ శ్రీనివాస్ వెల్లడించారు. ఎస్.కోట నూతన కోర్టు నిర్మాణం జి2 విధానంలో ఉంటుందని, కోర్టు ప్రాంగణంలో ఎటిఎం, ప్రత్యేక కక్షిదారుల కోసం బాత్ రూములు, మరుగుదొడ్లు వంటివి డిజైన్ లో రూపొందించినట్టు ఇంజినీరింగ్ అధికారులు జిల్లా జడ్జికి వివరించారు. ఇక కొత్తవలస కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల కోసం ప్రత్యేక బాత్ రూముల నిర్మాణానికి రూ.4లక్షల నిధులు మంజూరుకు ప్రతిపాదించామన్నారు. ఇదిలావుండగా ఎస్.కోట నూతన కోర్టు భవనాల కోసం రూపొందించిన డిజైన్లను మరోదఫా పరిశీలించిన అనంతరం ఫైనలైజ్ చేసి హైకోర్టుకు నివేదించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత స్పష్టం చేశారు. కాగా బార్ అసోసియేషన్ హాలును జిల్లా జడ్జి పరిశీలించిన అనంతరం న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు ఎస్.కోట కోర్టుకు అవసరమైన అకౌంటెంట్, ఇతర ఖాళీ పోస్టులను త్వరితంగా భర్తీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఇక ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జిగా నూతన బాధ్యతలు స్వీకరించిన కనకలక్ష్మికి న్యాయవాదులు పూర్తిగా సహకరించి త్వరితగతిన కేసుల పరిష్కారానికి చేయూతనందించాలని జిల్లా జడ్జి బబిత సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మేజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎన్టీవీ దాసు, జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, ఎం.దొరబాబు, డబ్ల్యు.ఎన్. శర్మ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, సీహెచ్‌ఆర్‌పి నాయుడు, జి.చిట్టిబాబు, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

డిజైన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

ఒప్పందానికి ముందే తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- మెంటాడ

గత ప్రభుత్వ ఒప్పందం ప్రకారం 2027 వరకు తాము ఎండియు వాహనాల ఆపరేటర్లుగా కొనసాగాల్సి ఉన్నా, కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా రద్దుచేయడం బాధాకరమని మండలంలోని ఎండియు వాహనాల ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ ఎస్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని అన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎండియు ఆపరేటర్ల సంఘం ప్రెసిడెంట్ లగుడు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రవి, ఆపరేటర్లు టి.ఉదయభాస్కరరావు, డి రాంబాబు, వి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని ఎండియు ఆపరేటర్లుగా గత ప్రభుత్వ ఒప్పందం ప్రకారం 2027 వరకు తాము కొనసాగాల్సి ఉన్నా, కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా రద్దుచేయడం బాధాకరమని మండలంలోని ఎండియు వాహనాల ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో తమ కుటుంబాలు వీధినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మోసకారి ప్రభుత్వానికి రాబోయే కాలంలో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎండియు ఆపరేటర్ల సంఘం ప్రెసిడెంట్ ఎం శంకర్రావు, వైస్ ప్రెసిడెంట్ గౌరిఈశ్వర్, ఆపరేటర్లు కామేష్, సతీష్, కే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: ఇంటింటికి నిత్యావసర సరుకులు అందజేసే ఎండియు ఆపరేటర్లు తహశీల్దార్ యం.శ్రీనుకు తమ సమస్యలపై బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, ప్రస్తుతం తమను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్ నుంచి తమను విదుల నుండి తప్పుకోండి అని చెప్పడం బాధాకరమన్నారు. తమకు 2027 జనవరి వరకు ఒప్పందం ఉన్నప్పటికీ విదుల నుండి తొలగించడం అన్యాయమన్నారు. తమకు ఏదైనా ఉపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు.

ఆర్‌అండ్‌బి అధికారులేరీ?

ప్రజాశక్తి- గంట్యాడ

90 రోజులకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు అర్‌అండ్‌బి అధికారులు ఎందుకు రావడం లేదని సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిపి పీరు బండి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పలు విషయాలను చర్చించిన తరువాత అర్‌అండ్‌బి సిబ్బంది సమావేశానికి గైర్హాజరు అవ్వడంతో మురపాకు గ్రామ సర్పంచ్ ఈదుబిల్లి రమేష్ అధికారులను నిలదీశారు. కొట్టారు బిల్లి జంక్షన్ నుంచి సిరిపురం మురిపాక పెదవేమలి వెళ్లే అర్ అండ్ బి రోడ్డుకు పలుచోట్ల మధుములు, కల్వర్టులు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, ఈ విషయాన్ని ఎవరితో చర్చించాలని ప్రశ్నించారు. పెదవేమల నుండి కొటారుబిల్లి జంక్షన్ వరకు ప్రయాణికులకు ఆటో సౌకర్యం ఉన్నప్పటికీ రోడ్డు బాగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, సిరిపురం, చంద్రంపేట, చిన్న వసంత, పెద్ద వసంత వెళ్లే రోడ్డులో కల్వర్టులు వద్ద గొయ్యలు ఏర్పడటం వల్ల వాహనాలు రాకపోకలకు అంతరాయ ఏర్పడుతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటువంటి సమస్యలను చెప్పుకునేందుకు వేదికగా ఉన్న సమావేశంలో సంబంధిత అధికారులు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి, ఎంఎడిఒ రమణమూర్తి, జెడ్‌పిటిసి వరి నరసింహ మూర్తి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఒకపూటే ఉపాధి పనులు నిర్వహించాలి

నిరసన తెలుపుతున్న వేతన దారులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఉపాధి హామీ పనులు ఒక్కపూట మాత్రమే నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని వేతనదారులు డిమాండ్ చేశారు. స్థానిక చిన్నమ్మతల్లి గుడి వద్ద పని ప్రదేశంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు పూటల పనులు పెట్టడం వల్ల పడుతున్న ఇబ్బందులు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు పూటల పని వల్ల కూలీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎండ తీవ్రంగా ఉండడంవల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రెండు పూటలా పనిచేసినా సక్రమంగా బిల్లులు పడే పరిస్థితి లేదనీ ఉపాధి కూలీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వర పనుల నిమిత్తం గడ్డపారలు, గున పాలు, గమేలాలు, తార్పాన్లు ఇవ్వడం లేదన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. అలవెన్సులు మంజూరు చేసి, గిట్టుబాటు కూలీ రూ.307 ఇవ్వాలని కుటుంబ సభ్యులకు జాబ్ కార్డులు జారీ చేయాలని, బకాయి ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.